

# ఇస్లాం

## మూల సూత్రాలు

# الأصول الثلاثة

(بلغة التلغو)

అనువాదం

జఫరుల్లాహ్ ఖాన్ నద్వీ

https://teluguislam.net

بسم اللہ الرحمٰن الرحیم

# الأصول الثلاثة

تألیف

شيخ الإسلام محمد بن عبد الوهاب

ترجمہ

ظفر الله خان ندوي

جمعیۃ إحیاء التراث الإسلامی
مركز الهداية لتوعية الجاليات
فرع الجهراء - الكويت

https://teluguislam.net

BOOK OF "AL USOOL- AL SALASA" (TELUGU)

Translator by :zafarullah khan nadvi

All Rights Reserved:

Fist Edition : 1st/oct /2005

Price :

Copies :

Printed by :

Published by :Guidance Center

Po.Box. No.1513
Jahra,01017.Kuwait
Tel-4550481-4553655
Fax No: 4552611
www.islamnoor.net

https://teluguislam.net

# భూమిక

1, ప్రతి మనిషి తన ప్రభువు గురించి క్షుణంగా తెలుసుకోవడం.

2, ఇస్లాం ధర్మం గురించి పూర్తిగా అవగాహన కలిగి ఉండటం.

3, ప్రవక్త ముహమ్మద్ (ﷺ) గురించి క్షుణంగా తెలుసుకోవడం.

https://teluguislam.net

అనంత కరుణామయుడు అపార కృపాశీలుడయిన అల్లాహ్ పేరుతో

# భూమిక

## ప్రియ పాఠకులారా!

అల్లాహ్ మీపై కరుణ కటాక్షాలు కురిపించుగాక, ఈక్రింద వ్రాయబడే నాలుగు విషయాలను క్లుప్తంగా తెలుసుకోవటం మనందరి విధ్యుక్త ధర్మం.

1, జ్ఞానాన్ని గ్రహించుట: అంటే అల్లహ్ మరియు ప్రవక్త ముహమ్మద్ (సల్లల్లాహు అలైహి వసల్లం(ﷺ)) ఇంకా ఇస్లాంధర్మం యొక్క పూర్వపరాలను సాక్ష్యాధారాలతో సహా తెలుసుకోవాలి.

2, తెలుసుకున్న జ్ఞానం ప్రకారం ఆచరించాలి.

3, ఈ ధర్మాన్ని (ఇస్లాం ధర్మాన్ని) ప్రచారం చేయాలి.

4, ఈ ధర్మ ప్రచారమార్గంలో ఎదురయ్యే కష్టాలను, సంభవించే అవాంతరాలను, సహనంతోనూ, స్థైర్యంతోనూ, మనోబలంతోనూ జయించాలి.

పైన పేర్కొనబడిన విషయసూచికలకు ఆధారం అల్లాహ్ ఈ వచనం ''కాలం సాక్షిగా! నిస్సందేహంగా మానవుడు పెద్దనష్టానికి గురిఅయి ఉన్నాడు. విశ్వసించి సత్కార్యాలు చేస్తూఉండే వారూ,ఒకరికొకరు సత్యోపదేశం, సహనబోధ చేసుకునేవారు తప్ప''(సూరతుల్ అస్ర్/1-3).

ధర్మ పండితులైన ''ఇమామ్ షాఫయీ ర.హ'' గారు ఈ సూరా యొక్క ప్రాధాన్యతను ఇలా వివరించారు: ''ఒకవేళ అల్లాహ్

https://teluguislam.net

మానవులకై దీనిని మాత్రమే అవతరింపజేసివున్నా వారు రుజుమార్గం పొందుటకై అది సరిపోయేది''.

ఇమామ్ బుఖారి (ర.హ) చెప్పడం, చెయ్యడం కంటే ముందుగా ''జ్ఞానం'' ఆర్జించటం ఉత్తమం అని బుఖారీ(హదీసు) గ్రంథంలో ఓ అధ్యాయాన్ని ప్రారంభించారు. దీనికి ఆధారంగా ఖుర్ఆన్ ఆయతును తెచ్చారు: ''కనుక ప్రవక్తా(ﷺ) బాగా **తెలుసుకో!** అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడనీ. నీ పొరపాట్లను క్షమించమని వేడుకో'' (ముహమ్మద్: 19).

అంటే అల్లాహ్ ఈ ఆయతుని చెప్పడం, చెయ్యడం కంటే **తెలుసుకో** అనే పదంతో ప్రారంభించాడు.

## ప్రియ పాఠకులారా!

అల్లాహ్ మీపై కరుణకటాక్షాలు కురిపించుగాక, క్రింద వివరించబోయే మరో మూడు విషయాలను క్షుణ్ణంగా తెలుసుకొని వాటిని ఆచరించటం కూడా ప్రతి ముస్లిం స్త్రీ పురుషుని విధ్యుక్త ధర్మం అని బాగా గుర్తుంచుకోవాలి.

1, అల్లాహ్ మనలందరినీ సృష్టించాడు, ఉపాధిని ప్రసాదించాడు, కాని మనల్ని వృథాగా వదిలిపెట్టలేదు. మన కొరకై ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ను ప్రభవింపజేసాడు. ఆయన అడుగుజాడల్లో నడుచుకున్న వారు స్వర్గవాసులౌతారు. మరెవ్వరైతే ఆయన ఆదేశాలను ధిక్కరించి హద్దులుమీరి గర్వానికి లోనయ్యారో వారు నరకవాసులౌతారు. కనుక అల్లాహ్ ఇలా ప్రకటించాడు: '' పూర్వం మేము ఫిరౌను వద్దకు ఒక

https://teluguislam.net

ప్రవక్త(మూసా)ను ఎలా పంపామో అలాగే మీ వ్యవహారం గురించి సాక్ష్యం ఇవ్వడానికి ఒక ప్రవక్త (ముహమ్మద్ ﷺ) ను మీ వద్దకు పంపాము(చూడండి) ఫిరౌను ఆ ప్రవక్త మాటను వినక పోవటంవల్ల మేము అతన్ని చాలా కఠినంగా పట్టుకున్నాము''(సూరతుల్ ముజమ్మిల్:15-16).

2, అల్లాహ్‌తో ఇతర శక్తులను, వ్యక్తులను, సాటి కల్పించి ఆరాధించడం అల్లాహ్ వద్ద క్షమించరాని నేరం. వారు అతి దగ్గరలో ఉన్న దైవదూతలైనా సరే, లేక మరే ప్రవక్త అయినా సరే. దీనికి ఆధారం అల్లాహ్ ఈ వచనం: ''మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరనీ ప్రార్థించకండి''

(సూరతుల్ జిన్:18)

3, అల్లాహ్‌ను, పరలోకాన్ని విశ్వసించినవారు. అల్లాహ్‌పై మరియు ఆయన ప్రవక్త(ﷺ)పై తిరుగుబాటు చేస్తున్నవారిని ఎన్నటికీ ప్రేమించరు చివరికి వారు తమ తండ్రులైనా, కొడుకులైనా, సోదరులైనా లేదా తమ కుటుంబసభ్యులైనా సరే ససేమిరా ప్రేమించరు. అలా ప్రేమించడాన్ని నీవు ఎన్నటికీ చూడలేవు. అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''అల్లాహ్‌నూ పరలోకాన్నీ విశ్వసించేవారు, అల్లాహ్‌ను ఆయన ప్రవక్తను వ్యతిరేకించే వారిని ప్రేమించటాన్ని నీవు ఎన్నడూ చూడలేవు. ఆ వ్యతిరేకించేవారు వారి తల్లిదండ్రులైనా, వారి కుమారులైనా, వారి సోదరులైనా సరే, లేదా వారి కుటుంబీకులైనా సరే. అల్లాహ్ వారి హృదయాలలో విశ్వాసాన్ని స్థిరంగా నాటాడు. తన తరఫునుండి ఒక ఆత్మను

https://teluguislam.net

ప్రసాదించి వారికి బలాన్ని ఇచ్చాడు. ఆయన వారిని క్రిందికాలువలు ప్రవహించే స్వర్గవనాలలో ప్రవేశింపజేస్తాడు. ఆ వనాలలో వారు శాశ్వితంగా ఉంటారు. అల్లాహ్ వారి పట్ల ప్రసన్నుడయ్యాడు, వారు అల్లాహ్ పట్ల సంతృప్తి చెందారు.వారు అల్లాహ్ పక్షానికి చెందినవారు. జాగ్రత్త! అల్లాహ్ పక్షంవారే సఫలీకృతులయ్యేవారు.''

(సూరతుల్ ముజాదిలహ్:22)

## ప్రియ పాఠకులారా!

అల్లాహ్ మీకు తనను అనుసరించుటకు, ఆరాధించుటకు, మార్గం సుగమం చేయుగాక. ఏకాగ్రత ఇబ్రాహీం(అలైహిస్సలాః) గారి సంప్రదాయం అనగా మనం పూర్తిగా ఏకోన్ముఖులమై అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించాలి అన్న విషయాన్ని బాగా మనం తెలుసుకోవాలి. అంటే మనసా, వాచా కర్మణా (త్రికరణశుద్ధితో) అల్లాహ్ ఏకత్వాన్ని స్వీకరించడం ''నా ఆరాధనకు'' అన్న అల్లాహ్ ఆజ్ఞకు సరియైన అర్థం ఇదే. ఉదాహరణకు అల్లాహ్ ఇలా తెలియజేసాడు: 'నేను జిన్నాతులనూ, మానవులనూ నా ఆరాధన కొరకే తప్ప మరిదేని కొరకూ సృష్టించలేదు'' (సూరతు జారియాత్:56).

అల్లాహ్ ఆజ్ఞలన్నిటిలోనూ అతి ముఖ్యమైనది ''తౌహీద్'' (ఏకేశ్వరోపాసన) సమస్త ఆరాధనా విధానాలు ఒక్క అల్లాహ్‌కు మాత్రమే సమర్పించడం. మరియు అల్లాహ్ నిషేధించిన విషయా లన్నిటిలోనూ అతి ముఖ్యమైనది''షిర్క్'' (బహుదైవారాధన) సృష్టితాలు అంటే సృష్టికర్తఅయిన అల్లాహ్‌కు సాటి కల్పించడం,

https://teluguislam.net

మొరపెట్టుకోవడం, మ్రొక్కుబళ్ళు చెల్లించడం, మోకరిల్లటం, వినయ వినమ్రతలతో ఆరాధించడం. కనుక అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి, ఆయనకు సాటి ఎవ్వరినీ నిలబెట్టకండి'' (సూరతున్ నిసా:26).

## ఇస్లాం ధర్మం మూడు మూల సూత్రాలు

ఏ మూడు అంశాలను తప్పనిసరిగా తెలుసుకోవాలనీ ఎవరైనా మిమ్మల్ని ప్రశ్నిస్తే?.... ఇలా బదులివ్వండి.

1, ప్రతి మనిషి తన ప్రభువు గురించి క్షుణంగా తెలుసుకోవడం.

2, ఇస్లాం ధర్మం గురించి పూర్తి అవగాహన కలిగిఉండటం.

3, ప్రవక్త ముహమ్మద్(ﷺ) గురించి క్షుణంగా తెలుసుకోవడం.

# మొదటి సూత్రం

## మనిషి తన ప్రభువు గురించి క్షుణంగా తెలుసుకోవడం

ఎవరైనా మీ దేవుడెవరనీ ప్రశ్నించినట్లయితే! మీరు ఇలా చెప్పండి: ''మన ప్రభువు అల్లాహ్,ఆయనే నన్ను నిన్ను, సర్వలోకాలను సృష్టించి పరిపాలించేవాడు, ఆయనే మన ఆరాధ్యుడు, అల్లాహ్ తప్ప మనకు వేరే ఆరాధ్యుడు లేడు. కనుక అల్లాహ్ ఆయనే ప్రభువనీ ఇలా ప్రకటించాడు: '' అల్లాహ్ మాత్రమే స్తుతింపదగినవాడు ఆయనే సర్వలోకాలకు ప్రభువు'' (సూరతుల్ ఫాతిహా:1)

శుభకరుడైన అల్లాహ్ తప్ప ప్రతి ఒక్క వస్తువు లోకం(సృష్టి) క్రిందే

https://teluguislam.net

వస్తుంది. నేను సైతం ఆ సృష్టిలోని ఓ వ్యక్తినే.

మీరు ఆ అల్లాహ్‌ను ఎలా తెలుసుకున్నారనీ ప్రశ్నించబడినట్లయితే? అప్పుడు మీరు ఆయన ఇచ్చిన సూచనలు మరియు వివిధ సృష్టిత్వాలను చూసి తెలుసుకున్నాను. వాటిలో రాత్రింబవళ్ళు, సూర్యచంద్రాదులు, ఏడు భూవ్యాకాశాలు, వాటికి మధ్య సృజింపబడినవన్నీ అల్లాహ్‌ను గుర్తు చేసే సజీవ సాక్ష్యాలే.దీన్ని గురించి ఖురాన్ ఆధారం: ''ఈ రేయింబవళ్ళు, ఈ సూర్యచంద్రాదులూ, అల్లాహ్ సూచనలోనివే, సూర్యచంద్రులకు సాష్టాంగ పడకండి. వాటిని సృజించిన దేవునికి సాష్టాంగ పడండి, నిజంగానే మీరు ఆయనను ఆరాధించే వారు అయితే'' (సూరతుల్ ఫుస్సిలత్:37).

''వాస్తవంగా మీ ప్రభువు అల్లాహ్‌యే. ఆయనే ఆకాశాలను, భూమినీ ఆరు దినాలలో సృష్టించాడు. తరువాత తన రాజ్యపీఠాన్ని అలంకరించాడు, రాత్రిని పగటిపై కప్పివేస్తాడు. ఆ తరువాత పగలు రాత్రివెంట పరుగు తీస్తూ ఉంటుంది. ఇంకా ఆయన సూర్యుణ్ణి చంద్రుణ్ణి నక్షత్రాలను పుట్టించాడు. అన్ని ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి.తెలుసుకోండి సృష్టి ఆయనదే. దానిపై ఆధిపత్యమూ ఆయనదే. అల్లాహ్ అనంతమైన శుభాలు కలిగినవాడు.

(సూరతుల్ ఆరాఫ్: 54)

అల్లాహ్ మాత్రమే ఆరాధనకు అర్హుడు. ఆధారం: ''మానవులారా! మిమ్మల్ని, మీకు పూర్వం వారిని సృష్టించిన మీ ప్రభువును ఆరాధించండి. దీనిద్వారానే మిమ్మల్ని మీరు రక్షించుకునే అవకాశం ఉంది. మీకొరకు భూమిని పాన్పుగాను, ఆకాశాన్ని కప్పుగాను

https://teluguislam.net

సృష్టించినవాడూ, పైనుండి వర్షాన్ని కురిపించి, తద్వారా అన్ని రకాల పంటలు పండే ఏర్పాటు చేసి మీకు ఉపాధిని కల్పించినవాడూ ఆయనే! ఇది మీకు తెలిసినప్పుడు ఇతరులను అల్లాహ్‌కు సమానులుగా నిలబెట్టకండి'' (సూరతుల్ బఖర:21-22)

ఇమామ్ ఇబ్ను కసీర్ ఈ ఆయతు వ్యాఖ్యానిస్తూ: ''పైన పేర్కొనబడిన వస్తువులను సృష్టించినవాడే అన్ని విధాల ఆరాధనలకు నిజమైన అర్హుడు'' అని అన్నారు.

ఆరాధనలోని రకాలు: ఏరకమైన మరి ఏ విధమైన ఆరాధనలనైతే పాటించమని నెరవేర్చమని అల్లాహ్ ఆజ్ఞాపించాడో వాటిలో ఇస్లాం, ఈమాన్, ఇహ్సాన్, ప్రార్థన, భయంభక్తి, ఆశ భరోసాలు, ప్రేమానురాగం, మొరపెట్టుకోవడం, అణకువ అశక్తత శరణు వేడుకోవడం, జిబహ్ చెయ్యడము, మొక్కుబడులు చెల్లించడం అన్నియు ఈ కోవకు చెందినవే. మరి ఇలాంటివే అన్ని రకాల ఆరాధనలు అల్లాహ్ కోసమే సొంతం చేయవలెను. కనుక అల్లాహ్ ఇలా ప్రకటించాడు: '' నిశ్చయంగా మసీదులు అల్లాహ్ కొరకే ప్రత్యేకించబడ్డాయి. కనుక వాటిలో అల్లాహ్‌తో పాటు ఇతరులెవ్వరనీ పిలవకండి'' (సూరతుల్ జిన్:18).

మరెవరైతే పైన చెప్పబడిన ఏ ఒక్క ఆరాధననైనా ఇతరులకు (దైవదూతలకు, ప్రవక్తలకు, ఔలియాలకు, లేక పీర్ ముర్షిద్‌లకు) సమర్పించి నట్లయితే వారు ముష్రిక్‌లు (బహుదైవారాధకులు) కాఫిర్లు (అవిశ్వాసులు)గా పరిగణించబడుతారు. అల్లాహ్ ఈ విధంగా ప్రకటించాడు :''ఎవరైనా అల్లాహ్‌తో పాటు మరొక ఆరాధ్యుణ్ణి

https://teluguislam.net

వేడుకుంటే, దానికి అతని వద్ద ఏ ప్రమాణమూ లేదు. అతని లెక్క అతని ప్రభువు వద్ద ఉన్నది. అటువంటి అవిశ్వాసులు ఎన్నటికీ సాఫల్యం పొందలేరు'' (సూరతుల్ మూమినూన్: 117).

పైన చెప్పబడిన వివిధ రకాలు కూడా ఆరాధనలేననీ ఖురాన్ మరియు హదీస్ ఆధారంగా రుఢీ అవుతోంది.

ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రభోదించారు: ''దుఆ ఆరాధన యొక్క సారం'' (తిర్మిజి)(1)

వేడుకోవడం అల్లాహ్ ఆరాధనేనని చెప్పటానికి ఖురాన్ ఆధారం: మీ ప్రభువు ఇలా అంటున్నాడు: ''నన్ను ప్రార్థించండి నేను మీ ప్రార్ధనలను అంగీకరిస్తాను. గర్వానికిలోనై నా అరాధనకు విముఖులయ్యేవారూ తప్పని సరిగా అవమానానికి పరాభవానికి గురై నరకములో ప్రవేశిస్తారు'' (సూరతుల్ మూ'మిన్-60).

భయం కూడా ఆరాధనేనన్న దానికి ఖురాన్ ఆధారం: ''నిజంగానే మీరు అల్లాహ్‌ను విశ్వసించినవారైతే నాకే భయపడండీ ప్రజలకు భయపడవలసిన అక్కరలేదు'' (సూరతు ఆలి ఇమ్రాన్: 175).

ఆశ కూడా ఆరాధనేననే దానికి ఖురాన్ ఆధారం: ''ఎవరైతే తన ప్రభువును కలుసుకోవాలనీ ఆశిస్తున్నారో వారు సత్కార్యాలు చేయాలి

(1)పైన చెప్పబడిన హదీసు ఆధా రపూర్వకమైనది కాదు. కాని అదే అర్థంలో వేరే హదీసు ఇలా ఉంది.ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఇలా ప్రకటించారు: ''అల్లాహ్‌ను వేడుకోవడమే ఆరాధన '' (తిర్మిజి, సహీహ్ అబూ దావూద్: 1329) ఈ హదీసు ఆధారపూర్వకమైనది.

https://teluguislam.net

ఆరాధనలో తన ప్రభువుతో పాటు మరెవ్వరినీ సాటిచేర్చకూడదు'' (సూరతుల్ కహఫ్: 110).

నమ్మకం, భరోసా కూడా ఆరాధనే అన్న దానికి ఖురాన్ ఆధారం: ''మీరు నిజంగానే ముస్లిములైతే అల్లాహ్‌నే నమ్ముకోండి''

(సూరతుల్ మాయిద: 23).

మరోచోట ఇలా ప్రకటించాడు'' అల్లాహ్‌ను నమ్ముకునవారికి అల్లాహ్‌యే చాలు'' (సూరతుత్ తలాఖ్: 3)

ప్రేమ అనురాగము, వినమ్రత, అంతయూ అల్లాహ్ ఆరాధనే అన్న దానికి ఆధారం: ''వారు ఉత్తమ కార్యాలకై ఎక్కువగా శ్రమించేవారు ప్రేమతోనూ, భయంతోనూ నన్ను ప్రార్థించేవారు, మా సమక్షంలో వినమ్రులై ఉండేవారు'' (సూరతుల్ అన్బియ: 90)

''వారితో (శత్రువులతో) మీరు భయపడకండీ నాకు భయపడండి'' (సూరతుల్ మాయిద:3)

మేమంతా అల్లాహ్‌వైపే మరలాలనీ ఖుర్‌ఆన్‌లో ఇలా ప్రకటించడం జరిగింది: ''మీ ప్రభువు వైపే మరలండి మరియు ఆయన విధేయులవ్వండి'' (సూరతుజ్ జుమర్: 54).

సహాయంకోరడం అల్లాహ్ ఆరాధనే అన్న దానికి ఆధారం: 'మేము నిన్నే ఆరాధిస్తున్నాము, సహాయం కొరకు నిన్నే అర్థిస్తున్నాము''

(సూరతుల్ ఫాతిహా: 5).

హదీసులో ఇలా ప్రకటించడం జరిగింది: ''ఎప్పుడైతే మీరు సహాయం కొరకై మొరపెట్టుకుంటారో అప్పుడు అల్లాహ్‌ను మాత్రమే

https://teluguislam.net

సహాయానికై అర్థించండి'' (తిర్మిజి).

శరణు వేడుకోవడం అల్లాహ్ ఆరాధనేననే అన్న దానికిఆధరంగా అల్లాహ్ ఇలా ప్రకటించాడు: '' ఇలా అను (ప్రవక్తా(ﷺ)) 'నేను మానవుల ప్రభువు, మానవుల చక్రవర్తి, ఆరాధ్య దైవం (అల్లాహ్) శరణు కోరుతున్నాను'' (సూరతున్ నాస్: 1-2).

మొరపెట్టుకోవడం కూడా ప్రభువు ఆరాధనే అవుతుంది: ''మీరు మీ ప్రభువును సహాయం కొరకు ప్రార్థించిన సందంర్భాన్ని కూడా జ్ఞాపకం తెచ్చుకోండి సమాధానంగా అప్పుడు ఆయన మీ ప్రార్థనను స్వీకరించాడు'' (సూరతుల్ అన్ఫాల్: 9).

ఖుర్బాని చెయ్యడము అల్లాహ్ ఆరాధనేనని ఇలా తెలుపడం జరిగింది: '' నా నమాజ్ నా సకల ఉపాసనారీతులు, నా జీవనం నా మరణం, సమస్తమూ సకలలోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకే. - ఆయనకు ఏ భాగ్యస్వామీ లేడు. ఈ ఆజ్ఞయే నాకు ఇవ్వబడింది. అందరికంటే ముందు విధేయతతో తలవంచేవాణ్ణి నేనే''

(సూరతుల్ అన్ఆమ్:162-163)

ప్రవక్త ముహమ్మద్(ﷺ) ఇలా ప్రవచించారు: ''ఎవరైతే దైవేతరులకై జిబహ్ చేస్తారో వారిపై అల్లాహ్ శాపం పడిం'' (ముస్లిం).

మ్రొక్కుబడులు చెల్లించడం అల్లాహ్ ఆరాధనేనని అల్లాహ్ ఇలా తెలియపరిచాడు: ''వారు (ప్రపంచంలో) మ్రొక్కుబడులు చెల్లించేవారు, నలువైపుల నుండి ఆపదలు క్రమ్ముకొని వచ్చే దినానికి భయపడేవారు'' (సూరతుల్ ఇన్సాన్: 7).

https://teluguislam.net

# రెండవ సూత్రం

## ఇస్లాం ధర్మం గురించి పూర్తిగా అవగాహన కలిగిఉండటం

అల్లాహ్ ఏకదైవరాధనను ప్రాణాలకంటే ఎక్కువగా ప్రేమిస్తూ, సర్వకార్యాలను అల్లాహ్ విధేయతలోనే నెరవేరుస్తూ, అల్లాహ్ ఆదేశాలకు అనుగుణంగా జీవిస్తూ మరల్చి, మరియు ఆయనకు ఎవరినీ సాటి కల్పించకుండా ఆరాధించే ధర్మాన్ని ఇస్లాం అంటారు.

## ఈ ధర్మాన్ని మూడు భాగాలుగా చేసి తెలుసుకోవచ్చు

## 1, ఇస్లాం 2,ఈమాన్ 3,ఎహ్సాన్

ఈ మూడు భాగాల్లో ప్రతి ఒక్క భాగానికి కొన్ని మౌలిక సూత్రాలున్నాయి.

**1, ఇస్లాం:** ఇస్లాం (శాంతి)మూల స్తంభాలు ఐదు

మహా ప్రవక్త ముహమ్మద్(ﷺ) ఇలా ఉపదేశించారు: ఇస్లాం ధర్మం ఐదు విషయాలపై ఆధారపడిఉంది.

(1) ‘‘తౌహీద్’’ (ఏకేశ్వరోపాసన) అల్లాహ్ తప్ప ఆరాధనకు అర్హుడైనవాడు ఎవ్వడూ లేడని, ముహమ్మద్(ﷺ) అల్లాహ్ దాసుడు మరియు సందేశహరుడని సాక్ష్యమివ్వాలి.

(2) నమాజును స్థాపించాలి.

(3) జకాత్ ఇవ్వాలి.

(4) రమజానులోని ఉపవాస వ్రతాన్ని విధిగా పాటించాలి.

(5) స్థోమత కలిగి ఉన్నవారు (జీవితంలో ఒక్కసారైనా) హజ్

https://teluguislam.net

చేయాలి. (బుఖారీ,ముస్లిం).

1,''షహాదతే తౌహీద్'' అంటే ఏకదైవారాధన సాక్ష్యం,

ఖురాన్ గ్రంథం యొక్క ఆధారం: 'అల్లాహ్ తప్ప మరో ఆరాధ్యనీయుడు లేడని స్వయంగా అల్లాహ్ యే సాక్ష్యమిస్తున్నాడు, మరియు దైవదూతలు (నీతిమంతులైన) సమస్త జ్ఞానులు కూడా సాక్ష్యమిస్తున్నారు. ఆయన న్యాయాన్ని స్థాపించేవాడు. ఆ మహాజ్ఞాని మహాశక్తిమంతుడు తప్ప మరో ఆరాధనీయుడు లేడు''.

(సూరతు ఆల్ ఇమ్రాన్: 18)

''షహాదతే తౌహీద్''(ఏకదైవరాధన సాక్ష్యము)అంటే అల్లాహ్ తప్ప ఆరాధ్యుడు ఎవ్వడు లేడు. ''లాఇలాహ'' అనే పదానికి అర్థం అల్లాహ్ ను తప్ప ప్రతి ఆరాధించే వస్తువులను తిరస్కరించడం. ''ఇల్లల్లాహ్'' అంటే ప్రతి విధమైన ఆరాధన ఒకేఒక అల్లాహ్ కు మాత్రమే అంకితం. ఎలాగైతే ఆయన రాజ్యాధికారంలో ఏ ఒక్కరికి జోక్యం చెల్లదో అలాగే ఆరాధన విషయంలో సహితం ఆయనకు భాగ్యస్వాములు ఎవరూలేరు. ఈ విషయం అల్లాహ్ వచనాల ద్వార మరింత స్పష్టమౌతుంది: ''ఇబ్రాహీమ్ తన తండ్రికీ, తన జాతి వారికీ ఇలా చెప్పిన ఆ సమయాన్ని జ్ఞాపకం తెచ్చుకో, ''మీరు పూజిస్తున్న వాటితో నాకు ఏ సంబంధమూ లేదు. నా సంబంధం కేవలం నన్ను సృష్టించిన వానితోనే ఉన్నది. ఆయనే నాకు మార్గం చూపుతాడు'' ఇబ్రాహీమ్ ఈ వచనాన్నే తన తరువాత తన సంతానం కోసం విడిచి వెళ్లాడు, వారు దానివైపునకు మరలేందుకై'' .

(సూరతుజ్ జుఖ్రుఫ్: 26-28)

https://teluguislam.net

మరొక చోట ఇలా ప్రకటించబడింది:''ప్రవక్తా(ﷺ) ఇలా చెప్పు: ''గ్రంథ ప్రజలారా! మాకూ మీకు మధ్య సమానమైన ఒక విషయం వైపునకు రండి. (అది ఏమిటంటే) మనం అల్లాహ్‌కు తప్ప మరెవరికీ దాస్యం చెయ్యరాదు. ఆయనకు భాగ్యస్వాములుగా ఎవరినీ నిలబెట్టరాదు. మనలోని వారెవరూ అల్లాహ్‌ను తప్ప మరెవరినీ తమ ప్రభువుగా చేసుకోరాదు అనేది''. ఈ సందేశాన్ని స్వీకరించటానికి వారు వైముఖ్యం కనబరిస్తే వారితో స్పష్టంగా ఇలా అను: 'మేము ముస్లిములము (కేవలం అల్లాహ్‌కే దాస్యం చేసేవారు, విధేయత చూపేవారు) అనే విషయానికి మీరు సాక్షులుగా ఉండండి''.

(సూరతు ఆలి ఇమ్రాన్: 64).

## దైవదౌత్యం పట్ల సాక్ష్యం:

ప్రవక్త ముహమ్మద్(ﷺ)అల్లాహ్ సందేశహరుడనీ సాక్ష్యం ఇవ్వడం. ఖురాన్ గ్రంథంలో అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''చూడండి మీవద్దకు ఒక ప్రవక్త వచ్చాడు. ఆయన స్వయంగా మీలోనివాడే. మీరు నష్టానికి గురికావటం అనేది ఆయనకు కష్టం కలిగిస్తుంది. మీ సాఫల్యాన్ని ఆయన తీవ్రంగా కాంక్షిస్తాడు. విశ్వాసులపై ఆయన వాత్సల్యం కలవాడు, కారుణ్యం కలవాడు.'' (సూరతు తౌబా:128)

ముహమ్మద్(ﷺ)అల్లాహ్ ప్రవక్త అని సాక్ష్యంఇవ్వడం: అంటే ఆయన ఆదేశాలను తు.చ.తప్పకుండా పాటించడము, విధేయత చూపడము. ఆయన చెప్పిన ప్రతిమాట సత్యమేననీ దృఢంగా విశ్వసించడం. వేటినైతే నిర్మూలించారో వాటిని పూర్తిగా విడనాడటము.

https://teluguislam.net

మరియు అల్లాహ్ ఆరాధనను ధర్మపద్ధతి, ధర్మ విధానాన్ని అనుసరించిపోనై ఆచరించడము.

తౌహీద్, నమాజు, జకాతు గురించి అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''వారు(ప్రజలు) పూర్తి ఏకాగ్రతతో అల్లాహ్‌ను ఆరాధించాలని ఆదేశించటం జరిగింది, అతనికే దాస్యాన్ని అంకితంచేసి పూర్తి ఏకాగ్రతతో నమాజ్ వ్యవస్థ నెలకొల్పాలి, జకాత్ చెల్లించాలి, ఇదే ఎంతో సత్యమైన, సవ్యమైన ధర్మం'' (సూరతుల్ బయ్యినహ్:5).

రమజాన్ ఉపవాసాలు పాటించాలని అల్లాహ్ ఇలా ఆదేశించాడు: ''విశ్వసించిన ప్రజలారా! ఉపవాసం మీకు విధిగా నిర్ణయించబడింది- ఏవిధంగా మీకు పూర్వం ప్రవక్తలను అనుసరించేవారికి కూడా విధించబడిందో. దీనివల్ల మీలో భయభక్తులు జనించే అవకాశం ఉంది.'' (సూరతుల్ బఖర:183)

అల్లాహ్ గృహానికి వెళ్ళి హజ్ విధులను నెరవేర్చమని అల్లాహ్ ఇలా ఆదేశించాడు: ''ప్రజలలో అల్లాహ్ గృహానికి వెళ్ళే శక్తి గలవారు దాని హజ్‌ను విధిగా చెయ్యాలి. ఈ ఆజ్ఞను పాలించటానికి తిరస్కరించినవాడు అల్లాహ్‌కు ప్రపంచ ప్రజల అవసరం ఎంతమాత్రం లేదు అని స్పష్టంగా తెలుసుకోవాలి.'' (సూరతు ఆలి ఇమ్రాన్: 97)

## 2, ఈమాన్(విశ్వాసం): దాని భాగాలు

ప్రవక్త ముహమ్మద్(ﷺ) ప్రబోధనం ప్రకారం:''ఈమాన్ భాగాలు డెబ్భైకన్నా ఎక్కువగా ఉన్నాయి.వాటిలో అతిపెద్ద భాగం ''లాఇలాహ ఇల్లల్లాహ్'' అన్న సద్వచనం. ఈమాన్‌లో అతిచిన్న భాగం,దారినుండి

https://teluguislam.net

హాని కలిగించేవాటినీ (బండరాళ్లు,ముళ్లకంపలు) దూరం చేయడం. మరియు ''సిగ్గు,లజ్జ'' కూడా ఈమాన్‌లోని ఒక భాగమే'' (ముస్లిం).

## ఈమాన్ మౌలిక సూత్రాలు ఆరు.

(1) అల్లాహ్ ఒక్కడే ఆరాధనకు, విన్నపాలకు అర్హుడని విశ్వసించాలి.

(2) దైవదూతలను విశ్వసించాలి.

(3) దైవం అవతరింపజేసిన గ్రంథాలను విశ్వసించాలి.

(4) దైవం తరుపు నుండి పంపబడిన ప్రవక్తలను విశ్వసించాలి.

(5) అంతిమ దినాన్ని విశ్వసించాలి.

(6) మంచిదైనా చేడుదైనా విధిరాతను విశ్వసించాలి.

పై ఆరు అర్కానులలో మొదటి ఐదు అర్కానుల పట్ల అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''సత్కార్యం అంటే మీరు మీ ముఖాలను తూర్పుకో పడమరకో త్రిప్పటం కాదు. సత్కార్యం అంటే మనిషి అల్లాహ్‌ను అంతిమదినాన్ని, దైవదూతలను, అల్లాహ్ అవతరింపజేసిన గ్రంథాలను,ఆయన ప్రవక్తలనూ హృదయ పూర్వకంగా విశ్వసించటం'' (సూరతుల్ బఖర: 177).

మరియు ఆరవది అంటే ''విధిరాత'' గురించి అల్లాహ్ ఇలా ప్రకటించాడు: 'మేము ప్రతి వస్తువును ఒక విధి నిర్ణయంతో పాటు సృష్టించాము.'' (సూరతుల్ బఖర :49).

https://teluguislam.net

## 3, ఎహ్సాన్ (పరోపకారం)

ఎహ్సాన్ గురించి అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ''భయభక్తులతో పనిచేస్తూ, యదార్థవైఖరి కలిగిఉండే వారితో అల్లాహ్ ఉంటాడు'' (సూరతున్ నహల్:128). మరొక చోట ఇలా ఆదేశించాడు: ''మహాశక్తిమంతుడైన, ఆ అనంతకరుణామయుడిపై పూర్తి నమ్మకాన్ని ఉంచు. ఆయన నిన్ను, నీవు (నమాజుకై) లేచినపుడు చూస్తాడు. నీవు సజ్దా చేస్తుండగా నీ కదలికలను గమనిస్తున్నాడు. ఆయన అన్ని వినేవాడు , అంతా తెలిసినవాడు.'' (సూరతుష్ షుఅరా:217-220) మరొక చోట ఇలా ఆజ్ఞాపించాడు: ''ప్రవక్తా! నీవు ఏ స్థితిలో ఉన్నా, ఖురాను నుండి దేనిని వినిపించినా, మానవులారా! మీరు ఏది చేసినా, ఆ అన్ని సందర్భాలలోనూ మేము మిమ్మల్ని చూస్తునే ఉంటాము.''

(సూరతు యూనుస్: 61).

మరియు ప్రవక్త ముహమ్మద్(ﷺ)ఇహ్సాన్ గురించి ''హదీసే జిబ్రయీల్'' అని పేరుగాంచిన ఈహదీస్ ద్వారా ఇలా తెలియ జేస్తున్నారు:హజ్రత్ ఉమర్ బిన్ ఖత్తాబ్(ర.జి)ఉల్లేఖనం ప్రకారం:''ఒక రోజు ప్రవక్త ముహమ్మద్(ﷺ) ప్రజలతో సమావేశమై ఉండగా, అకస్మాత్తుగా ఒక వ్యక్తి మా వద్దకు వచ్చాడు, అతని బట్టలు ఎంతో తెల్లగా, అతని శిరోజాలు మరెంతో నల్లగా ఉన్నాయి. అతన్ని చూస్తే ప్రయాణించి వచ్చినట్టుగాని, అతను మాకు పరిచయమున్న వ్యక్తిగాకానీ తెలియడం లేదు. అతను ''దైవప్రవక్త దగ్గరకు వచ్చి తన మోకాళ్ళను ప్రవక్త(ﷺ) మోకాళ్ళకు ఆనించి, తన రెండు చేతులను

https://teluguislam.net

ఆయన తొడలపై ఉంచి కూర్చున్నాడు.ఓ ముహమ్మద్(ﷺ) ఇస్లాం అంటే ఏమిటి అని ప్రశ్నించాడు? దానికి ప్రవక్త ముహమ్మద్(ﷺ) :

(1) నీవు అల్లాహ్‌ను మాత్రమే (దేవునిగా భావించి)ఆరాధించాలి. (దైవత్వంలో) మరెవరినీ ఆయనకు సహవర్తులుగా చేయకూడదు.

(2) నమాజు(ప్రార్థనా) వ్యవస్థను నెలకొల్పాలి.

(3) జకాత్ (పేదల ఆర్థిక హక్కు)ను విధిగా చెల్లించాలి.

(4) రమజాన్ నెల ఉపవాసాలు పాటించాలి.

(5) స్థోమత కలిగి ఉన్నవారు (జీవితంలో ఒక్కసారైనా) హజ్ చేయాలి అని బదులిచ్చారు:

ఆ వ్యక్తి, నీవు చెప్పినది నిజమేనని అన్నాడు. మేము (ఈ మాటపై) చాలా ఆశ్చర్యపడ్డాము అతనే ప్రశ్నించాడు మరియు అతనే ధృవపరుస్తున్నాడేమిటా అని!.

విశ్వాసం (ఈమాన్) అంటే ఏమిటి?'' అని ఆ వ్యక్తి మళ్ళీ అడిగాడు. దానికి ముహమ్మద్(ﷺ)సమాధానమిస్తూ ''విశ్వాసం అంటే నీవు దేవుణ్ణి, దైవ దూతలను, దైవప్రవక్తలను, (పరలోకంలో) దేవుని ముందు హాజరు కావలసి ఉంటుందన్న విషయాన్ని, (మరణించిన మానవులు) తిరిగి బ్రతించబడతారన్న విషయాన్ని నమ్మాలి'' మంచిదయినా చెడుదయినా విధిరాతను విశ్వసించాలి. అని అన్నారు.

''ఇహ్సాన్'' అంటే ఏమిటి?'' అని ఆ వ్యక్తి తిరిగి ప్రశ్నించాడు. ''ఇహ్సాన్ అంటే, నీవు దేవుణ్ణి ప్రత్యక్షంగా చూస్తున్నట్లు (అత్యంత

https://teluguislam.net

భయభక్తులతో) ఆయన్ని ఆరాధించాలి. నీవు ఆయన్ని చూడలేక పోయినా ఆయన మాత్రం నిన్ను తప్పకుండా చూస్తున్నాడు. (అన్న యదార్థాన్ని గుర్తుంచుకో)'' అని అన్నారు ముహమ్మద్(ﷺ).

''దైవ ప్రవక్తా! ప్రళయం ఎప్పుడొస్తుంది?'' అని మరో ప్రశ్న అడిగాడు ఆ వ్యక్తి. ''ప్రళయం గురించి ప్రశ్నించేవాడికన్నా సమాధానమిచ్చేవాడికి ఎక్కువేమీ తెలియదు'' అని అన్నారుముహమ్మద్(ﷺ).తరువాత అతను కనీసం ప్రళయం సంభవించే కొన్ని సూచనల గురించి వివరించండి, అని ప్రశ్నించాడు?

అప్పుడు ప్రవక్త ముహమ్మద్(ﷺ) (1)''ఆ రోజుల్లో దాసి తన యజమానిని కంటుంది. (2) కాళ్ళకు చెప్పులు తొడగనివారు, వంటిపై బట్టలు వెయ్యనివారు (అనాగరికులుగా ఉన్న) పశువుల కాపర్లు పెద్ద పెద్ద భవంతులు కట్టడంలో ఒకొరికొకరు పోటీపడతారు.

ఈ సంభాషణ తరువాత ఆ వ్యక్తి వెళ్ళిపోయాడు. తరువాత మేము (సహచరులు) నిశబ్దముగా కూర్చోనుండగా ప్రవక్త ముహమ్మద్ (ﷺ) హజరత్ఉమర్ (రజి) గారితో ప్రశ్నిస్తూ ఆయన ఎవరో మీకు

---

(1) దాసి తన యజమానిని (స్త్రీ లేక పురుషుడు) కంటుంది అన్న దానికి అర్థం ఏమంటే: అతి ముఖ్యమైన కార్యాలు దానికి అర్హులుకానివారికి, అవగాహనంలేని వారికి అప్పగించడబడును.

(2) కాళ్ళకు చెప్పులు తొడగనివారు,వంటిపై బట్టలు వెయ్యనివారు (అనాగరికులుగా ఉన్న) పశువుల కాపర్లు పెద్ద భవంతులు కట్టడంలో ఒకర్నొకరు పోటీపడతారన్న దానికి అర్థం: అధములు, అల్పులు, వివేకవంతుల కంటే, జ్ఞానవంతులకంటే ఎక్కువగా వెలిగిపోతారు.

https://teluguislam.net

తెలుసా అన్నారు?అప్పుడు ఉమర్(రజి) గారు‘‘అల్లాహ్‌కు, మరియు ఆయన ప్రవక్తకే బాగా తెలుసు’’అని బదులిచ్చారు. ‘‘ఆ వ్యక్తి (ఎవరోకాదు) జిబ్రయీల్ (దైవదూత). ఈ విధంగా ఆయన మీకు మీ ధర్మంగురించి చెప్పడానికి వచ్చారు’’ అని అన్నారు. (ముస్లిం).

# మూడవ సూత్రం

## ప్రవక్త ముహమ్మద్(ﷺ) గురించి తెలుసుకోవడం

ప్రవక్త ముహమ్మద్(ﷺ) పూర్తి పేరు ముహమ్మద్ బిన్ అబ్దుల్లా బిన్ అబ్దుల్ ముత్తలిబ్ బిన్ హాషిమ్. బనూ హాషిమ్ ఖురైష్ తెగకు చెందినవారు. ఖురైష్ అరబ్ వాసులు, మరియు అరబ్ వాసులు దైవ ప్రియులైన ప్రవక్త ఇబ్రాహీమ్‌గారి జేష్టపుత్రుడు హజ్రత్ ఇస్మాయీల్ (అలైహిస్సలామ్)గారి సంతానం.

ప్రవక్త ముహమ్మద్(ﷺ) 63 సంవత్సరాలు జీవించారు, ప్రవక్త కాక మునుపు 40 సంవత్సారాలు, ప్రవక్తగా నియమితులైన తరువాత 23 సంవత్సరాలు, మరియు ఆయన మక్కా నగరములో జన్మించారు.

ప్రవక్త ముహమ్మద్(ﷺ)పై (ఇఖ్‌రా బిస్మి రబ్బి కల్లజీ ఖలఖ్) అనే ఖుర్‌ఆన్ సూరా అవతరణతో ప్రవక్త పదవి ప్రసాదించబడింది. మరియు (యా అయ్యుహల్ ముద్దసిర్-ఖుమ్ ఫ అన్‌జిర్) సూరా అవతరణతో సందేశబాధ్యత అప్పగించబడింది. ముహమ్మద్(ﷺ) బహుదైవారాధన పట్ల హెచ్చరించుటకై, ఏకదైవరాధన ప్రచారానికై ప్రభవింపజేయబడ్డారు.

https://teluguislam.net

((యా అయ్యుహల్ ముద్‌దస్‌సిర్-ఖుమ్ ఫ అన్‌జిర్-వ రబ్బక ఫకబ్బిర్- వసియాబక ఫతహ్‌హిర్-వర్ రుజ్‌జా ఫహ్‌జుర్-వలా తమ్‌నున్ తస్‌తక్‌సిర్-వలి రబ్బిక ఫస్‌బిర్))(అల్ ముద్‌దస్‌సిర్:1-7)

వాక్య వివరణ:

((ఖుమ్ ఫఅన్‌జిర్)) అంటే బహుదైవారాధన నుండి భయపెట్టండి, మరియు ఏకదైవారాధన వైపుకు పిలుపు నివ్వండి.

((వ రబ్బక ఫకబ్బిర్)) అంటే ఏకదైవారాధనతో పాటు అల్లాహ్ ఔన్నత్యాన్ని చాటిచెప్పండి.

((వసియాబక ఫతహ్‌హిర్)) నీవు దుస్తులను పరిశుభ్రంగా ఉంచుకో- అంటే తమ కార్యాలను మరియు ఆరాధనలను బహుదైవారాధన నుండి దూరంగా ఉంచడము.

((వర్ రుజ్‌జా ఫహ్‌జుర్)) "అర్‌రుజ్‌జా" అంటే విగ్రహాలు "ఫహ్‌జుర్" (విడనాడండీ) అనగా ఓ ప్రవక్తా! ఎలాగైతే నీవు ఇంతవరకు విగ్రహాలతో, విగ్రహారాధకులతో దూరంగా ఉన్నావో అదే విధంగా ఉండు.

ప్రవక్త ముహమ్మద్(ﷺ) పది సంవత్సరాల వరకు ఏకదైవారాధన యొక్క ఘనతను చాటి చెప్పారు. పది సంవత్సరాల తరువాత ప్రవక్త ముహమ్మద్(ﷺ) గారికి గగనయాత్ర (మేరాజ్) చేయించడం జరిగింది. అక్కడ ప్రతి రోజు ఐదు పూటలు నమాజు చేయాలనీ విధిగావించబడింది. తరువాత మూడు సంవత్సరాల వరకు మక్కాలోనే నమాజు విధిని పాటించారు. ఆ తరువాత మదీనా

https://teluguislam.net

పురానికి వలసపోవాలని ఆదేశించబడినది. దీనిని అరబీ భాషలో హిజ్రత్ అంటారు. ''హిజ్రత్'' అంటే బహుదైవాలను ఆరాధించే పట్టణము నుంచి ఇస్లామియ ధర్మాన్ని అచరించే పట్టణముకు వలస పోవడము, ఈ అచరణ నియమావళి ప్రవక్త(ﷺ)గారి సముదాయంపై ప్రళయం వరకు విధిగావించబడింది. కనుక అల్లాహ్ ఇలా ప్రకటించుచున్నాడు:''తమ ఆత్మలకు అన్యాయం చేసుకుంటూ ఉండేవారు ప్రాణాలను తీసి, దైవదూతలు వారిని, ''ఇదేమిటి మీ స్థితి ఇలా ఉంది?'' అని అడిగారు. అప్పుడు వారు ఇలా సమాధానం ఇచ్చారు: ''మేము భూమిపై బలహీనులముగా, నిస్సహాయులముగా ఉండేవారము.'' దైవదూతలు ''అల్లాహ్ భూమి విశాలంగా లేదా మీరు వలస పోవటానికి?'' అని అడిగారు. వారి నివాసం నరకం. అది మహా చెడ్డ నివాసం. అయితే నిజంగానే నిస్సహాయులై బయలు దేరటానికి ఏ మార్గమూ,ఏ సాధనసంపత్తీ లేని పురుషులనూ,స్త్రీలనూ, పిల్లలనూ అల్లాహ్ క్షమించవచ్చు. (ఎందుకంటే) అల్లాహ్ ఎక్కువగా క్షమించేవాడూ అధికంగా మన్నించేవాడును'' (అన్ నిసా: 97-99).

మరొక చోట ఇలా ఉంది: ''విశ్వసించిన నా దాసులారా! నా భూమి విశాలమైనది. కనుక మీరు నన్ను మాత్రమే ఆరాధించండి''.

(అల్ అన్‌కబూత్:56)

ఇమామ్ బగ్‌వీ (ర.హ) గారు ఈ అయతు పూర్వాపరాలను వివరిస్తూ ''ఎవరైతే మక్కాలోనే ఉండిపోయారో, మదీన నగరానికి వలస పోలేదో అల్లాహ్ వారిని ఓ విశ్వాసులారా అని పిలుపునిచ్చాడు. ప్రవక్త ముహమ్మద్(ﷺ) హిజ్రత్ గురించి ఇలా సెలవిచ్చారు:

https://teluguislam.net

'పశ్చాత్తాప (క్షమాపణ) ద్వారాలు తెరిచి ఉన్నంత వరకూ హిజ్రత్ చేయడం అనేది కూడ ఉంటుంది. పడమర నుండి సూర్యుడు ఉదయించేవరకు. క్షమాపణ ద్వారం బందు కాదు (ప్రళయం వరకు క్షమాపణ ద్వారం తెరిచి ఉంటాయి)(అబూదావూద్, సునన్ నిసాయి).

ప్రవక్త ముహమ్మద్ (ﷺ)మదీనాలో పూర్తిగా స్థిరపడిన తరువాత మిగతా ఇస్లామీయ ఆదేశాలు ఆరాధనలు అంటే జకాత్, ఉపవాసాలు, హజ్, అజాన్, జిహాద్, మరియు మంచిని పెంపొందించడం చెడును నిర్మూలించడం వంటి నియమాలు విధించబడ్డాయి. వాటిని ప్రవక్త ముహమ్మద్ (ﷺ) పది సంవత్సరాల పాటు పాటించారు తరువాత ఆయన(ﷺ) మరణించారు. కాని ఈ నాటికీ ఆయన తెచ్చిన ధర్మం ఎలాంటి హెచ్చుతగ్గులు లేకుండా సజీవంగా ఉన్నది.

## ఇస్లామియ ధర్మం మరియు ప్రవక్త ముహమ్మద్(ﷺ) సంప్రదాయం గురించి క్షుణంగా తెలుసుకుందాం.

ప్రవక్త ముహమ్మద్ (ﷺ) ఈ ఇస్లామీయ ధర్మంలో ఉన్న ప్రతి మంచి ఆచారాన్ని గురించి స్పష్టంగా చెప్పారు, అలాగే ప్రతి చెడు కార్యాల గురించి హెచ్చరించారు. ఏ మంచి ఆచారాన్నైతే తెలియజేసారో అవి ఏకదైవారాధన మరియు ఏఏ కార్యాలతోనైతే అల్లాహ్ ఇష్టపడుతాడో మరియు ఆయన ప్రసన్నత పొందగలుగుతావో అవన్నియు తెలియజేసారు, ఏ చెడు కార్యాలనైతే హెచ్చరించారో అవి బహుదైవారాధన. మరియు ఏ ఏ కార్యాలతోనైతే అల్లాహ్ ద్వేషిస్తాడో చెడుగా భావిస్తాడో వాటన్నిటిని గురించి తెలియజేసారు. అల్లాహ్ సర్వ

https://teluguislam.net

మానవాళికై ప్రవక్త ముహమ్మద్(ﷺ) గారిని ప్రభవింపజేసాడు, ఆయన విధేయతను సకలలోకాల జీవుల (జిన్నులు మరియు మానవుల) పై విధించాడు. కనుక అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''ముహమ్మద్! ఇలా ప్రకటించు''మానవులారా! నేను మీ అందరి వైపునకు వచ్చిన అల్లాహ్ సందేశహరుణ్ణి''(అల్ ఆరాఫ్: 158).

అల్లాహ్ ప్రవక్త(ﷺ)పై ఇస్లాం ధర్మాన్ని పరిపూర్ణం చేసాడు. దీని ఆధారంగా అల్లాహ్ ఆదేశం ఇలా ఉంది: ''ఈ నాడు మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేసాను. మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేసాను మీ కొరకు ఇస్లాంను మీ ధర్మంగా అంగీకరించాను''(అల్ మాయిదా:3).

ప్రవక్త ముహమ్మద్ (ﷺ)మరణాన్ని గురించి అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ''ఓ ప్రవక్తా! నీవు మరణిస్తావు, వారూ మరణిస్తారు. చివరకు ప్రళయంనాడు మీరంతా మీ ప్రభువు సమక్షంలో మీమీ వ్యాజ్యాలను వినిపిస్తారు'' (అజ్జుమర్: 30-31). అలాగే ప్రజలు చనిపోయిన తరువాత ప్రళయంనాడు బ్రతికించబడుతారు. అల్లాహ్ ఇలా సెలవిచ్చాడు: ''ఈ నేలనుండే మేము మిమ్మల్ని సృష్టించాము, దానిలోనికే మేము మిమ్మల్ని తిరిగి తీసుకు పోతాము. దాని నుండే మిమ్మల్ని మళ్ళీ వెలికి తీస్తాము'' (తాహా: 55).

''అల్లాహ్ మిమ్మల్ని చిత్రవిచిత్రంగా మొలపించాడు, తరువాత ఆయన మిమ్మల్ని ఈ భూమిలోకే తిరిగి తీసుకుపోతాడు, మళ్ళిదాని నుండే యొకాయెకీ మిమ్మల్ని బయటకు తీసి నిలబెడతాడు''

(నూహ్:17-18).

https://teluguislam.net

ప్రళయం రోజున లెక్క తీసుకోబడును, ఆ తరువాత వారి కర్మల ప్రకారం ప్రతిఫలం ప్రసాదించబడుతుంది. అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ''భూమ్యాకాశాలలోని ప్రతి వస్తువుకు యజమాని అల్లాహ్‌యే-చెడు చేసేవారికి అల్లాహ్ వారి కర్మలకు ప్రతి ఫలం ఇచ్చేందుకు, మంచి చేసేవారికి అల్లాహ్ వారి మంచికర్మలకు ప్రతి ఫలం ప్రసాదించేందుకు'' (అన్ నజ్మ్: 31).

ప్రళయంనాడు మరణించిన పిదప మళ్లీ జీవం లేదు అని విశ్వసించిన వారు తిరస్కారులు. అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''అవిశ్వాసులు తాము మరణించిన పిదప మళ్లీ లేపటం అనేది ఎంత మాత్రం జరగదు అని భ్రమలోపడి ఉన్నారు. వారితో ఇలా అను ''కాదు, నా ప్రభువు సాక్షిగా! మీరు తప్పకుండా లేపబడుతారు. తరువాత మీరు (ప్రపంచంలో) ఏమేమీ చేసారో అదంతా మీకు తప్పకుండా తెలియ జేయటం జరుగుతుంది. ఇదంతయూ అల్లాహ్‌కు చాలా సులభమైనదే'' (అత్ తగాబున్:7).

అల్లాహ్ ప్రవక్తలందరినీ శుభవార్తను తెలిపేవారుగా, హెచ్చరిక చేసేవారుగా పంపినాడు. కనుక అల్లాహ్ ఇలా తెలియజేసాడు: ''ఈ ప్రవక్తలందరినీ శుభవార్తను తెలిపేవారుగా, హెచ్చరిక చేసేవారుగా వారి అవిర్భావం తరువాత అల్లాహ్‌కు ప్రతికూలంగా వాదించటానికి ప్రజల వద్ద ఏ సాకు మిగలకూడదని'' (అన్ నిసా; 165)

మొట్ట మొదటి ప్రవక్త నూహ్ అలైహిస్సలామ్, చిట్టచివరి ప్రవక్త ముహమ్మద్(ﷺ). ఆయన తరువాత ఏ ప్రవక్తా రాడు.కనుక అల్లాహ్

https://teluguislam.net

ఇలా ప్రకటించాడు: ''ప్రవక్తా! మేము నీవైపునకు వహీ (దైవవాణి)ని పంపాము, నూహ్ వైపునకు ఆయన తరువాత ప్రవక్తల వైపునకు పంపినట్లు'' (అన్ నిసా:163).

అల్లాహ్ ప్రవక్త నూహ్ (అలైహిస్ సలామ్)నుండి ఆఖరి ప్రవక్త ముహమ్మద్(ﷺ) వరకు, ప్రతి తెగ వైపునకు ఒక ప్రవక్తను ప్రభవింప జేసాడు. వారందరు తమ తమ తెగవారిని ఒక అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి, మరియు మిథ్యాదైవాలన్నిటి నీ(తాగూత్) విడనాడండి అని వారించారు. అల్లాహ్ ఇలా ప్రకటించాడు: ''మేము ప్రతి జాతిలోనూ ఒక ప్రవక్తను ప్రభవింపజేసాము. అతని ద్వారా అందరికీ ఇలా హెచ్చరిక జేసాము: ''అల్లాహ్‌ను ఆరాధించండి మిథ్యాదైవాల (తాగూత్) ఆరాధనకు దూరంగా ఉండండి''(అన్‌నహ్ల్:36).

మిథ్యాదైవాలన్నిటినీ(తాగూత్) తిరస్కరిస్తూ అల్లాహ్‌నే విశ్వసించి ఆయన్నే ఆరాధించాలనీ అల్లాహ్ ప్రజలందరికి విధిగాచేసాడు.

ఇమామ్ ఇబ్నుల్ ఖయ్యిమ్ (రహ)గారు తాగూత్ పదానికి అర్థం ఈ విధంగా తెలియజేసారు: బూటకపు దైవాలను ఆరాధించటం లేక అల్లాహ్ ఆజ్ఞలకు విరుద్ధంగా అమలు చేయడం.ఇలాంటి ''తాగూత్లు'' చాలా ఉన్నాయి. వాటిలో ఐదు అతి ముఖ్యమైనవి.

1,ఇబ్‌లీస్ లయీన్. (శాపగ్రస్తుడు ఇబ్లీస్)

2, ఏ వ్యకిఅయితే పూజింపబడతాడో అతను కూడా ఆ పూజలో రాజి పడుతాడో.

3, ఎవడైతే తమను పూజింపుటకై పిలుపునిస్తాడో.

4, అగోచరజ్ఞానం తెలుసుననీ చెప్పుకునేవాడు.

5, ఇస్లామియ ధర్మాంశాలను నెరవేర్చకుండా వాటికి విరుద్ధంగా తీర్పుఇవ్వడం.

అల్లాహ్ ఈ విధంగా ప్రకటించాడు ''ధర్మం విషయంలో నిర్బంధంకానీ, బలాత్కారంకానీ లేదు. సత్యవాక్కు అసత్యవాక్కుల నుండి ప్రస్ఫుటం చెయ్యబడింది. ఇకనుండి తాగూత్‌ను తిరస్కరించి అల్లాహ్‌ను విశ్వసించినవాడు సుస్థిరమైన, ఎన్నటికీ విడిపోని ఆశ్రయం పొందినట్లే.(అతడు ఆశ్రయించిన) అల్లాహ్ సర్వమూ వింటాడు సమస్తమూ తెలిసినవాడు''(అల్ బఖరా: 256).

ఇదే ''లాఇలాహ ఇల్లల్లాహ్'' (అల్లాహ్ తప్ప వేరే పూజ్యనీయుడు లేడు) అనడానికి వాస్తవమైన అర్థం.

ప్రవక్త ముహమ్మద్(ﷺ) ఇలా ప్రకటించారు: ''ఇస్లామే అసలైన ధర్మం, నమాజు దీని స్తంభం, దీని అత్యుత్త విలువైన స్థానం ''అల్ జిహాద్ ఫీ సబీలిల్లాహ్'' (సునన్ తిర్మిజి, అహ్మద్).

https://teluguislam.net